
సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం । 31 । మార్చి । 2023



కేజీహెచ్‌లో పౌష్టికాహారం

కేజీహెచ్‌లో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పోషకాలతో కూడిన ఆహారం అందించనున్నారు.

8లో



ఆలస్యంగా నడిచిన రైళ్లు

పశ్చిమగోదావరి జిల్లాలో దురంతో ఎక్స్‌ప్రెస్ బొలెరో వాహనాన్ని ఢీ కొన్న కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

8లో



రంగులకళ

కళాకారుల అందాన్ని ద్విగుణీకృతం చేసే రూపశిల్పులుగా మేకప్ ఆర్టిస్టులు కీలక భూమిక పోషిస్తున్నారు.

8లో



న్యూస్‌రీల్

నేడు జాబ్ మేళా

మురళీనగర్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి, కె.సుధ తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. అరవిల యానిమల్ హెల్త్ లిమిటెడ్, మెడ్ ప్లస్ ఫార్మసీ, బీజేడీ 2050 హెల్త్‌కేర్ లిమిటెడ్, ఏటీసీ టైర్ ఏపీ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలు వివిధ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ వెబ్ సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, బీఫార్మసీ, డిగ్రీ, జీడీఏ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, డిప్లమా కోర్సులు చేసిన వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అన్ని సంస్థల్లోనూ అన్ని కేటగిరీల్లో కలిపి 365 పోస్టులకు ఎంపిక జరుగుతుంది. పోస్టును బట్టి రూ.10,000లు నుంచి రూ.24,000లు వరకు జీతం లభిస్తుంది.

దివ్యాంగుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 24 బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఏప్రిల్ 13వ తేదీలోగా అందజేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ ఏడాది జూలై 1 నాటికి 51 సంవత్సరాలు దాటి ఉండరాదని తెలిపారు. అంధులకు (9), బధిరులకు (8), శారీరక వైకల్యం గల వారికి (7) కేటాయించారు. ఈ పోస్టులకు కనీస అర్హతలు తెలియజేసే పూర్తి నోటిఫికేషన్, పోస్టుల వారీగా వివరాలు, సూచనలు, దరఖాస్తు ఫారాలను https@//visakhapatnam.ap.gov.in వెబ్ సైట్ నుంచి పొందవచ్చని తెలిపారు.

ఏపీ ఎకనామిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పరమేశ్వరరావు



ఎంవీపీ కాలనీ: ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఆచార్య కొండపల్లి పరమేశ్వరరావు నియమితులయ్యారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం పూర్వ ఆచార్యుడైన ఆయన ఏయూ దూరవిద్యా కేంద్రం ఎకనామిక్స్ విభాగం ద్వారా విద్యార్థులకు దశాబ్దాలపాటు విశిష్ట సేవలు అందించారు. ఇటీవల తిరుపతి వేదికగా జరిగిన 39వ ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆచార్య పరమేశ్వరరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, నగర ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఆచార్య పరమేశ్వరరావు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొనడంతోపాటు ప్రస్తుతం పర్యావరణం, ఆర్థిక అంశాలకు సంబంధించి పలు పత్రికల్లో సంపాదకీయాలు రాస్తున్నారు. మానవత సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

5న చలో ఢిల్లీ



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే నెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు గురువారం పిఠాపురం కాలనీ నుంచి సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ ర్యాలీని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ర్యాలీ మద్దిలపాలెం కూడలి మీదుగా సత్యం జంక్షన్ వయా సీతమ్మధార, హెచ్‌బీకాలనీ, వెంకోజీపాలెం, ఇసుకతోట, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు, రామాటాకీస్ మీదుగా మద్దిలపాలెం వరకూ కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు జె.ఆర్.నాయుడు, పి.వెంకటరావు, కుమారి, అనపర్తి అప్పారావు, దల్లి రవి, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.





అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

చూసిన కనులదే భాగ్యమట..

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జిల్లాలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంబికాబాగ్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో, సింహాచలం అప్పన్న స్వామి, మురళీనగర్‌లో శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. వేలాదిమంది భక్తులు తరలివచ్చారు.

- నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం
- నగరానికి శ్రీరామనవమి శోభ
- వాడవాడలా కల్యాణకాంతులు
- స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

అంబికాబాగ్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 నుంచి 10 గంటల వరకు అభిషేకాలు జరిపారు. అనంతరం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దేవస్థాన వేదపండితుల ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పట్టు వస్త్రాలు సమర్పించారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. అభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొనగా, వందలాది మంది స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం వేలాది మంది భక్తులకు విందు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.రమేష్‌నాయుడు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు బి.సత్యరూపవాణి, మళ్ల ధనలత, ఎం.అశోక్‌కుమార్, బెహరా వెంకటరత్నం, బుద్దల అనురాధ, ఎస్ సతీష్, వంకాయల మారుతీప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, ప్రకాష్, ఎక్స్ అఫిసియో సభ్యుడు కొడమంచలి శ్రీనివాస శర్మ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు వెంపలి రాంబాబు, కార్యనిర్వాహక ఇంజినీరు సీహెచ్‌వీ రమణ, పి.రామారావు, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, కోడిగుడ్ల పూర్ణిమ, తోట పద్మావతి, కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ ఈవో జ్యోతిమాధవి, శాంతి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శారదపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర. చిత్రంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష తదితరులు

నేడు పట్టాభిషేకం

కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు స్వామి పట్టాభిషేకం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో రమేష్‌నాయుడు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు వేదసభ, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈవో ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వావ్.. వైజాగ్!

- క్షేత్ర పర్యటనలో జీ-20 దేశ ప్రతినిధుల కితాబు
- పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంపై ప్రశంసలు
- నగర అందాలకూ ముగ్ధులైన విదేశీయులు

సాక్షి, విశాఖపట్నం : నగరంలో మూడు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జీ20 సదస్సు ముగింపు దశకు చేరుకుంది. మూడో రోజున పట్టణ మౌలిక సదుపాయాలకు ఫైనాన్సింగ్ సౌకర్యంపై వ్యూహరచన చేశాయి. సదస్సు అనంతరం నగరంలో పలు ప్రాంతాల్లో విదేశీ ప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటించారు. ముడసర్లోవ ఫ్లోటింగ్ సోలార్, కాపులుప్పాడ వేస్టు టు ఎనర్జీ ప్లాంట్, స్కాడా సిస్టమ్‌లను సందర్శించారు. నగర అందాలు జీ20 దేశాల ప్రతినిధులు ముగ్ధులై.. వావ్ వైజాగ్ అని కితాబిచ్చారు.

ఆస్ట్రేలియా, బ్రెజిల్ అధ్యక్షతన విశాఖ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్(ఐడబ్ల్యూజీ) రెండో దశ సదస్సు ముగిసింది. స్థిరమైన ఆర్థిక నగరాల నిర్మాణం కోసం ఎలాంటి ప్రణాళికలు సిద్ధంచేయాలనే అంశంపై సభ్యదేశాల ప్రతినిధులు కూలంకషంగా చర్చించారు. నగరాల అభివృద్ధి కోసం నిధుల సమీకరణకు అవలంబించాల్సిన విధానాలపై రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఇప్పటికే పలు దేశాల్లోని నగరాల్లో అనుసరిస్తున్న వ్యూహాలను ఆయా దేశాల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. మూడు రోజుల పాటు దాదాపు 8 భిన్నమైన సెషన్లు నిర్వహించారు. నగరాభివృద్ధి, పట్టణాభివృద్ధిలో భాగంగా ఎదురవుతున్న సవాళ్లను ఎలా అధిగమించాలన్న అంశాలపై జీ20 దేశాలు కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించారు.

విశాఖ.. ఓ అద్భుతం

మూడో రోజు సెషన్ ముగిసిన అనంతరం.. జీ20 దేశాల ప్రతినిధులు నగర సందర్శించారు. ఈ సందర్భంగా విశాఖలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను పరిశీలించారు. కాపులుప్పాడలోని చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌తో పాటు.. దేశంలోనే తొలి ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్రాజెక్టుగా రికార్డులకెక్కిన ముడసర్లోవ రిజర్వాయర్‌లోని ప్రాజెక్టును సందర్శించారు. అదేవిధంగా విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (వీసీఐసీడీపీ)లో భాగంగా మాధవధారలో స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ పథకం పనితీరుని పరిశీలించారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం కోసం శ్రమిస్తున్నారంటూ అభినందించారు. దీంతో పాటు పెద వాల్తేరులోని మినీ సూయిజ్ ఫామ్-3 (ఎంఎస్ఎఫ్)లో ఉన్న ఎలక్ట్రానిక్ వెహికల్స్‌ను ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ప్రతినిధులు పరిశీలించారు. ప్రతి ప్రాజెక్టు నగర అభివృద్ధికి చిహ్నంగా ఉన్నాయని, ప్రజలకు అందించాల్సిన మౌలిక వసతులతో పాటు, ప్రజారోగ్యంపై దృష్టిసారిస్తూ వినూత్నంగా ప్రాజెక్టులు నిర్వహించడాన్ని విదేశీ ప్రతినిధులు అభినందించారు. నగర సుందరీకరణ, సాగరతీరంలో అందాలు, వాల్‌పెయింటింగ్స్ చూసి ప్రతినిధులు ముగ్ధులయ్యారు. విశాఖ అందాలకు నెలవంటూ ప్రశంసలు కురిపించారు.

నేడు విశాఖ నుంచి తిరుగుపయనం

మూడు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించిన జీ20 సదస్సులో పాల్గొన్న సభ్యదేశాలు, అతిథ్యదేశాల ప్రతినిధులు శుక్రవారం విశాఖ నుంచి తిరుగు పయనం కానున్నారు. శుక్రవారం ఉదయం దేశంలో ఎంపిక చేసిన వివిధ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కమిషనర్లతో సభ్యదేశాల ప్రతినిధులు సమావేశం కానున్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న రెజిలియన్స్ ప్రాజెక్టుల పనితీరు, వాటి ద్వారా ప్రజలకు, నగరాలు పట్టణాలకు కలుగుతున్న ఉపయోగాలపై కమిషనర్లు వివరించనున్నారు. ఈ సదస్సులో పలు యూనివర్సిటీల వీసీలు, ప్రొఫెసర్లు, ఎంపిక చేసిన విద్యార్థులు కూడా హాజరుకానున్నారు. అనంతరం విదేశీ ప్రతినిధులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించనున్నారు. విమానాశ్రయంలో వీడ్కోలు పలికేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. స్వాగతించినప్పుడు ఏ విధంగా సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారో వీడ్కోలు కూడా అదే రీతిలో ప్రతినిధులకు చిరాకాలం గుర్తుండిపోయేలా ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాట్లు చేశారు.



ముడసర్లోవ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు వద్ద జీ-20 ప్రతినిధులు



కాపులుప్పాడ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ పరిశీలిస్తున్న విదేశీ ప్రతినిధులు

స్త్రీ శిశు సంక్షేమశాఖలో ఉద్యోగాలు

- 5 అంగన్‌వాడీ, 42 హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్
- ఏప్రిల్ 3 వరకు దరఖాస్తుకు గడువు

విశాఖ విద్య: జిల్లాలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల భర్తీకి అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. 5 అంగన్‌వాడీ కార్యకర్తలు, 42 అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులను భర్తీ చేయనున్నారు. పదో తరగతి విద్యార్హతతో ఉద్యోగం దక్కనుండటంతో వీటికి తీవ్రమైన పోటీ నెలకొంది. ప్రధానంగా స్థానిక నివాసం కలిగిన వివాహిత స్త్రీ, 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకైతే 21 ఏళ్లు నిండని వారు లేకుంటే, 18 ఏళ్ల పై బడిన వారిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు యూనిట్‌గా తీసుకొని రోస్టర్ విధానం అమలు చేస్తున్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ వివరాలను https:// visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆయా కేంద్రాల పరిధిలోని స్థానికులకు మాత్రమే ప్రాధాన్యత ఉంటుంది. ఏప్రిల్ 3 సాయంత్రం 5 గంటల్లోపు ఆయా కేంద్రాల పరిధిలోకి వచ్చే ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులపై గెజిటెడ్ అధికారి సంతకాలు చేయించి, ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయంలో అందజేసి, తగిన రశీదు పొందాలని జిల్లా ప్రాజెక్టు అధికారి డి. వెంకటేశ్వరి తెలిపారు.

విద్యాశాఖలో అంతర్యుద్ధం

- అధికారుల తప్పటడుగులు
- కాకరేపిన ప్రవీణ్ ప్రకాష్ టూర్
- అధికారులపై చర్యలకు రంగం సిద్ధం

విశాఖ విద్య : జిల్లా విద్యాశాఖలోని అధికారుల మధ్య అంతర్యుద్ధం సాగుతోంది. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిల్లా పర్యటనతో అధికారుల తప్పటడుగులు బహిర్గతమయ్యాయి. జిల్లా విద్యా శాఖను గాడిలో పెట్టేందుకు ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ రెండు నెలలు సమయం ఇచ్చారు. అయినప్పటికీ ఏమాత్రం మార్పు రాలేదు. దీంతో అధికారులపై చర్యలకు ఉపక్రమించేందుకు రంగం సిద్ధమౌతున్నట్లు తెలుస్తోంది. ఇది జిల్లా విద్యాశాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది.

జిల్లాలో 1,385 పాఠశాలలు ఉండగా, వీటిలో 3,72,134 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 587 స్కూల్స్ ఉన్నాయి. వీటి పరిధిలో 87,861 మంది విద్యార్థులు విద్యనభ్యశిస్తుండగా, వీరికి ప్రభుత్వ/ఎల్‌బీ టీచర్స్ 3,543 మంది, ఎయిడెడ్ టీచర్లు 169 మంది చదువులు చెబుతున్నారు. విద్యా కార్యక్రమాల అమలుకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు సెక్టోరియల్ అధికారులు, క్షేత్రస్థాయిలో సీఆర్పీలు, సచివాలయ విద్యా కార్యదర్శులు ఉన్నారు. వీరందరినీ సమన్వయం చేసుకుంటూ ఎంఈవో, డిప్యూటీ డీఈవోలు షెడ్యూల్ మేరకు పాఠశాలలను పర్యవేక్షించాల్సి ఉంది.



విశాఖ నగరంలోని పోర్ట్‌బెసిక్ స్కూల్

చార్జిమెమోలు జారీకి రంగం సిద్ధం

అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ డీఈవో, డీఈవో, ఆర్జేడీలకు చార్జి మెమోలు జారీకి రంగం సిద్ధమైంది. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ బుధవారం నాటి జిల్లా పర్యటనలో గుర్తించిన లోపాల మేరకు క్రమశిక్షణ చర్యలు తీవ్రంగానే ఉంటాయని విద్యాశాఖ వర్గాల్లో చర్చసాగుతోంది. ఉపాధ్యాయులపై చర్యలు కోరుతూ తాను ఇచ్చిన నివేదికలపై డీఈవో కార్యాలయం నుంచి ఎటువంటి సమాధానం రాలేదని ప్రవీణ్ ప్రకాష్ వద్ద డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ చెప్పడం జిల్లా విద్యా శాఖాధికారుల మధ్య అంతర్యుద్ధానికి దారి తీసింది. ఇదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

తేలనున్న లెక్క

ఏఈవోల నుంచి ఆర్జేడీ వరకు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించి, గుర్తించిన లోపాల మేరకు ఉపాధ్యాయుల నుంచి సంజాయిషీ కోరాలని విద్యాశాఖ కమిషనరేట్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. 15 మంది టీచర్లపై అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సువర్ణ చర్యలకు సిఫార్స్ చేసినట్టు చెబుతున్నారు. డిప్యూటీ డీఈవో గౌరీ శంకర్ తనిఖీల్లో తీసుకున్న చర్యలపై స్పష్టమైన లెక్క చెప్పలేని పరిస్థితి. వీటికి సంబంధించి తదనంతరం తీసుకున్న చర్యలేంటి..? ఆ నివేదికల ప్రతులు డీఈవో కార్యాలయానికి చేరాయా..? అనే దానిపై స్పష్టమైన లెక్క కావాలని ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించడంతో అధికారుల్లో గుబులు మొదలైంది.

క్షేత్రస్థాయి అధికారుల పర్యవేక్షణ కరువు

విశాఖ నగరంలోని మున్సిపల్ స్కూళ్లపై విద్యాశాఖ డివిజన్, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్న పోర్ట్‌బెసిక్ ప్రాథమిక పాఠశాలలో 81 మంది విద్యార్థులు ఉంటే, ఒకరిని వర్క్ అడ్జిస్ట్‌మెంట్‌పై వేరే స్కూల్‌కు పంపించారు. మరో టీచర్ ఫిబ్రవరి నుంచి మెటర్నరీ లీవ్‌లో ఉన్నారు. హెచ్‌ఎం మెడికల్ లీవ్ పెట్టారు. దీంతో అక్కడ ఒకే టీచర్ పాఠాలు బోధిస్తున్నారు. ఇలాంటి చోట మరో టీచర్ సర్దుబాటు చేయటం లేదా, వర్క్ అడ్జిస్ట్‌మెంట్‌పై వెళ్లిన వారిని వెనక్కి పిలిపించాలి. డివిజన్, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లేమిని ఇది తేటతెల్లం చేస్తోంది. విద్యా కార్యక్రమాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినా, జిల్లాలోని కొంతమంది డివిజన్, మండల స్థాయి అధికారులు అలసత్వం వల్ల విద్యాఫలాలు సవ్యంగా అందని పరిస్థితులు ఉన్నాయి.

రేపటి నుంచి కేజీహెచ్ రోగులకు పౌష్టికాహారం

పెంచిన డైట్ చార్జీలు అమలు

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పోషకాలతో కూడిన ఆహారం అందించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డైట్ చార్జీలను గతంలో ఎన్నడూ లేని విధంగా రెట్టింపు చేసింది. గర్భిణులకు కూడా ప్రత్యేక మెనూ సిద్ధం చేశారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం కోసం ఒక్కొక్కరికి రూ.36 చెల్లిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇవే డైట్ చార్జీలు అమలవుతున్నాయి. రోగులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చార్జీలను రూ.80కు పెంచింది. డ్యూటీ డాక్టర్ల కోసం రూ.80 చెల్లిస్తుండగా.. ప్రస్తుతం రూ.100కు పెంచారు. గర్భిణులకు కూడా ఒక్కొక్కరికి రూ.100తో భోజనం అందించనున్నారు. పెంచిన చార్జీలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి. కాగా.. కేజీహెచ్‌లో 1200 మంది రోగులు, 56 మంది డ్యూటీ వైద్యులకు రోజూ అల్పాహారం, భోజనం సరఫరా చేస్తున్నారు.

ముగిసిన పీఏసీ సభ్యుల పర్యటన


మాట్లాడుతున్న డీఆర్‌ఎం అనూప్

తాటిచెట్లపాలెం : వాల్తేరు డివిజన్‌లో రైల్వే ప్రయాణికుల సదుపాయాల కమిటీ (పీఏసీ) పర్యటన గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పర్యటనలో గుర్తించిన వివరాలపై మాట్లాడారు. ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ పీకే మహారాణా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి, పీఏసీ కమిటీ సభ్యులు దిలీప్‌కుమార్ మల్లిక్, అభిజిత్‌దాస్, నిర్మల కిశోర్ బొల్లిన, గొట్టాల ఉమారాణి, జీవీ మంజుల, పరశురాం మహతో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఈ నెల 26 నుంచి వాల్తేర్ డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్లలో పర్యటించిన విషయం తెలిసిందే.

బం గారు పళ్లానికైనా గోడ చేర్పు కావాలని పెద్దలు చెబుతారు. అదే విధంగా కళాకారులు ఎంతటి అందమైన వారైనా.. ఆ సౌందర్యానికి అదనపు తళుకులు అద్దాల్సిందే. అప్పుడే మరింత అందం, ఆకర్షణ చేకూరుతాయి. సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టీవీ సీరియళ్లు, నాటికలు, నాటకాలు, ఏకపాత్రాభినయాలు, లఘుచిత్రాలు.. ఇలా ఏ కళారంగమైనా ఆ బాధ్యత తీసుకుంటారు మేకప్ ఆర్టిస్టులు. కళాకారుల అందాన్ని ద్విగుణీకృతం చేసే రూపశిల్పులుగా వారిది కీలక భూమిక. కేవలం అందానికి మెరుగులు దిద్దడమే కాకుండా.. పాత్రలకు అనుగుణంగా తారలను తీర్చిదిద్దడం మేకప్ ఆర్టిస్ట్‌ల ముఖ్యవిధి. ఎలాంటి ఉపాధి, ఆసరా, భరోసా లేని 60 ఏళ్ల కిందటే విశాఖలో మేకప్ కళను నమ్ముకున్నారు ముగ్గురు అన్నదమ్ములు. ఆ కళనే ఉపాధి మార్గంగా మార్చుకుని ధైర్యంగా బతుకు పయనం మొదలుపెట్టారు. వారే అల్లిపురానికి చెందిన కిల్లంపల్లి సత్యారావు, వరహాలు, రాంబాబు. తర్వాత తరం వారి అడుగుజాడల్లో **నడుస్తోంది.**

– విశాఖపట్నం డెస్క్

రంగుల కళ

- **అందానికి అదనపు తళుకులద్దేది మేకప్ ఆర్టిస్ట్‌లే..**
- **పౌరాణికం, జానపదం, సాంఘికం ఏదైతేనేం.. వారి చేయి పడితే కటౌట్ అదరాల్సిందే..**
- **ఆదరణ తగ్గుతున్నా.. కళనే నమ్ముకుని** జీవనం సాగిస్తున్న కళాకారులు



అక్కినేని నుంచి నంది స్వీకరిస్తున్న వరహాలు (ఫైల్)



కిల్లంపల్లి కళాకారుల పనితీరుకు నిదర్శనం: సీతారామ లక్ష్మణ, కూడియాట్టం వేషధారణలో కళాకారులు

ఒకప్పుడు నాటికలు, నాటకాలు పెద్ద ఎత్తున ప్రదర్శించేవారు. పది మంది కూడిన ప్రతి చోటా నాటక సమాజాలు ఉండేవి. దీంతో సత్యారావు, వరహాలు, రాంబాబు చేతి నిండా పనితో నిత్యం బిజీగా ఉండేవారు. గ్రామాల్లో జరిగే పండగల్లో దేవతలు, రాక్షసులు, పులివేషాలకు మేకప్ వేస్తూ చక్కగా ఉపాధి పొందేవారు. అయితే నాటకాలకు ఆదరణ కరువైన తర్వాత వీరికి పని లేకుండా పోయింది.

ఏడాదిలో నాలుగు నెలలే పని

నాటకాలు ఆదరణ కోల్పోవడం, పండగల్లో వేషాలకన్నా డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి ఇతర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుండడంతో తమకు మునుపట్లా పని దొరకడం లేదని రాంబాబు కుమారుడు కన్నాచారి తెలిపారు. విశాఖలో మేకప్ కళకు ఆద్యులైన సత్యారావు, వరహాలు, రాంబాబు కాలం చేశాక వరహాలు కుమారులైన సత్యానందం, ప్రసాద్, రాంబాబు కుమారుడినైన తాను ఇప్పటికీ ఈ వృత్తిలో కొనసాగుతున్నట్లు కన్నాచారి తెలిపారు. ఇప్పుడు తమకు మహా అయితే ఏడాదిలో నాలుగు మాసాలే పని ఉంటుందని చెప్పారు. పాఠశాలలు, యూనివర్సిటీల్లో జరిగే కార్యక్రమాల్లో విద్యార్థులకు గాంధీ, భగత్‌సింగ్, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి నాయకులు, శ్రీకృష్ణ జన్మాష్టమి సమయంలో కృష్ణుడు, గోపికల వేషాలు కావాలని అడుగుతారని కన్నాచారి వివరించారు.

కోల్‌కతా నుంచి మేకప్ సామగ్రి

తాము వివిధ రకాల వేషధారణలకు సంబంధించి సామగ్రిని కోల్‌కతా నుంచి రప్పించుకుంటామని కన్నాచారి తెలిపారు. అయితే తాము కోరిన సామగ్రి కోరినట్లు రాదని.. అప్పుడు ఆ సామగ్రిని తమకు కావాల్సినట్లు మలుచుకుంటామన్నారు. కొన్నిసార్లు కొన్ని ఆహార్యాల కోసం తామే సొంతంగా సామగ్రిని తయారు చేసుకుంటామని చెప్పారు.

నాన్నకు నంది వచ్చింది



మేకప్ కళనే నమ్ముకున్న మా నాన్న వరహాలుకు 2001లో నంది అవార్డు వచ్చింది. పద్యనాటక విభాగంలో అశ్వత్థామ పాత్రధారికి ఆయన చేసిన మేకప్‌నకుగానూ మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు చేతుల మీదుగా నంది అందుకున్నారు. వెనుకటి రోజుల్లో ఓ వెలుగు వెలిగినా.. ఇప్పుడు ఏదో అలా బతకడానికి మా సంపాదన సరిపోతోంది. మాకు కళాకారుల పెన్షన్ వంటిది కల్పిస్తే బాగుంటుంది. ప్రస్తుతం ఇక్కడ మా కుటుంబం, మా తమ్ముడు కన్నాచారి కుటుంబమే ఈ వృత్తిలో కొనసాగుతున్నాం.

– **కిల్లంపల్లి సత్యానందం,** మేకప్ ఆర్టిస్ట్, అల్లిపురం

కళను ఒడిసి పట్టుకున్నారు



మా పెదనాన్నలు సత్యారావు, వరహాలు, మా నాన్న రాంబాబు మేకప్ కళకు సంబంధించి ప్రత్యేకంగా శిక్షణ తీసుకోలేదు. వారికున్న ఆసక్తి కొద్దీ ఆ కళను ఒడిసి పట్టుకున్నారు. వారి తర్వాత పిల్లలమైన మేము ఈ వృత్తిని స్వీకరించి కొనసాగుతున్నాం. మా పెదనాన్న కొడుకు సత్యానందం, అతని సోదరుడు ప్రసాద్, నేను, మా తమ్ముడు ఈ వృత్తిలో ఉన్నాం. మా తమ్ముడు మేకప్ శ్రీను కొన్నాళ్ల కిందట మరణించారు. మా అబ్బాయిలు రాకేష్, ప్రశాంత్‌లు చేదోడుగా ఉంటారు. బతుకు బండి లాగేందుకు ఈ సంపాదన సరిపోతుందని చెప్పాలి. ప్రభుత్వం సహకారం అందిస్తే బాగుంటుంది.

– **కిల్లంపల్లి కన్నాచారి,** మేకప్ కళాకారుడు, అల్లిపురం

15 ఏళ్లుగా నటుడిగా రాణిస్తున్నా..



15 ఏళ్లుగా నటుడిగా కొనసాగుతున్నా.. ఏటా ఆంధ్రా యూనివర్సిటీలో జరిగే ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా వివిధ రకాల వేషాలు వేస్తుంటాను. 2022లో ఉత్తమ నటుడిగా అవార్డు సాధించా. ఏయూలో దర్శకత్వ శాఖలో శిక్షణ తీసుకుంటూ.. సినిమా అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నా. నాకు అల్లిపురం సత్యానందం, కన్నాచారే మేకప్ చేస్తుంటారు.

– **సంపత్‌రావు కామేశ్వరరావు,** విశ్రాంత లోకో పైలెట్, ఔత్సాహిక రంగస్థల నటుడు

పండగ సమయాల్లోనే పని



నేను వేరే ఉద్యోగం చేసుకుంటున్నా.. నాన్నకు పని ఉన్న సమయంలో సాయపడుతుంటాను. మా తమ్ముడు కూడా మేకప్ చేస్తుంటాడు. ఈ పని ఉత్సాహంగా అనిపిస్తుంది. స్కూల్ ఫంక్షన్లు, కృష్ణాష్టమి తదితర పండగ సమయాల్లో మాకు పని ఉంటుంది. మిగిలిన రోజుల్లో అంతగా ఉండదు.

– **కిల్లంపల్లి రాకేష్,** కన్నాచారి కుమారుడు

గోపిక వేషం వేశాను



కృష్ణాష్టమి సందర్భంగా గోపిక వేషం వేశాను. మా నాన్న నన్ను తీసుకెళ్లి వేషం వేయించారు. ముఖానికి రంగులు వేసి, బొట్లు పెట్టారు. ఆ వేషం నాకు భలే నచ్చింది. పాఠశాలలో తోటి స్నేహితులు, ఉపాధ్యాయులు నన్ను మెచ్చుకున్నారు.

– **నీహారిక,** 7వ తరగతి, టైనీ టాట్స్ హైస్కూల్, ద్వారకానగర్

అచ్చం కృష్ణుడిలా ఉన్నావన్నారు



స్కూల్లో వేషం వేయమని చెప్పారు. అప్పుడు మా నాన్న నాకు కృష్ణుడి వేషం వేయించారు. ఆ వేషంలో నన్ను చూసిన అందరూ అచ్చం కృష్ణుడిలాగే ఉన్నావని అన్నారు. నాకు ముందు భయం వేసింది. ఆ తర్వాత చాలా సంతోషం అనిపించింది.

– **గునుపూరు దీక్షన్,** టైనీ టాట్స్ హైస్కూల్, ద్వారకానగర్

సికింద్రాబాద్-అగర్తలా మధ్య వన్ వే స్పెషల్

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో సికింద్రాబాద్-అగర్తలా మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

- సికింద్రాబాద్-అగర్తలా (07018) వన్ వే స్పెషల్ ఏప్రిల్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మంగళవారం రాత్రి 11.15 గంటలకు అగర్తలా చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగుడ, సత్తెనపల్లె, గుంటూరు. విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్, డంకుని, భర్ద్‌మాన్, రాంపూర్‌హట్, మాల్దా టౌన్, కిషన్ గంజ్, న్యూ జల్పాయ్‌గురి, జల్పాయ్‌గురి రోడ్, న్యూ కూచ్ బిహార్, న్యూ అలిపుర్‌దౌర్, న్యూ బొంగయ్‌గావ్, గోల్‌పర, గువాహటి, జాగి రోడ్, హోజయ్, లండింగ్, న్యూ హేఫ్లంగ్, బాదర్‌పూర్, న్యూ కరీంగంజ్, ధర్మనగర్, అంబాసా స్టేషన్లలో ఆగుతుంది.

ఆటోడ్రైవర్‌పై హత్యాయత్నం

అల్లిపురం: ఆటోడ్రైవర్‌పై ఓ కొబ్బరి కత్తితో దాడి చేశాడు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఆర్టీసీ కాంప్లెక్స్ దరి లలితా జ్యూయలర్స్ వద్ద సీతమ్మపేట ప్రాంతానికి చెందిన పి.వెంకటరమణ చెప్పులు కుడుతుంటాడు. అతని దుకాణం ఎదురుగా గాజువాకకు చెందిన ఆటోడ్రైవర్ ఆర్.శ్రీనివాస్ ఆటో అడ్డంగా నిలిపాడు. ఆటోను పక్కకి తియ్యమంటే వినలేదని కొబ్బరి బొండాల కత్తితో ఆటోడ్రైవర్ తలపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

మేకప్ ఆర్టిస్ట్‌పై దాడి

సీతమ్మధార: మేకప్ ఆర్టిస్ట్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి నగదు లాక్కొని పరారయ్యారు. అక్కయ్యపాలెంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలివీ..అక్కయ్యపాలేనికి చెందిన అప్పలకొండ రామలింగేశ్వర స్వామి ఆలయం పక్కనే పాయింట్ సెలూన్ దుకాణం నడుపుతున్నాడు. సినిమా తారలకు మేకప్ చేస్తుంటాడు. బుధవారం షూటింగ్‌కు వెళ్లి.. రాత్రి షాపు వద్దకు వచ్చాడు. దుకాణంలో నగదు తీసుకుని అక్కయ్యపాలెం వివేకానంద ఆస్పత్రి పక్క రోడ్డులో నడుచుకుని ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో అటుగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి లిఫ్ట్ కావాలా అని అడిగారు. కొంచెం ముందు దించేయాలని అప్పలకొండ వారి ద్విచక్ర వాహనం ఎక్కాడు. కొద్ది దూరం తీసుకువెళ్లి అతన్ని బెదిరించారు. అతని జేబులో ఉన్న రూ.6వేల నగదును బలవంతంగా లాక్కొని దాడి చేసి పరారయ్యారు. ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్‌లో తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు ఫిర్యాదు చేశాడు. క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు


విశాఖపట్నం స్టేషన్‌కు ఆలస్యంగా చేరుకున్న రైలు

తాటిచెట్లపాలెం: పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు వద్ద గురువారం తెల్లవారుజామున దురంతో ఎక్స్‌ప్రెస్ బొలెరో వాహనాన్ని ఢీ కొంది. ఈ కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు రెండు నుంచి మూడున్నర గంటల ఆలస్యంగా విశాఖపట్నం చేరుకున్నాయి. దురంతో ఎక్స్‌ప్రెస్ లోకో మరమ్మతులు గురికావడంతో.. మరో లోకోను ఏర్పాటుచేసి విశాఖపట్నం తీసుకొచ్చారు. గురువారం ఉదయం 6.25 గంటలకు విశాఖపట్నం చేరుకోవాల్సిన ఈ రైలు మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుంది. అలాగే నాందేడ్-విశాఖపట్నం (20812) మూడు గంటలు, తిరుపతి-విశాఖపట్నం(22708) డబుల్ డెక్కర్ రెండున్నర గంటలు, బెంగళూరు-భువనేశ్వర్(18464) మూడు గంటలు, పుదుచ్చేరి-భువనేశ్వర్(12897) మూడు గంటలు, కడప-విశాఖపట్నం(17487) రెండున్నర గంటలు, మహబూబ్‌నగర్-విశాఖపట్నం(08586) ఐదున్నర గంటలు, గుంటూరు-రాయగడ (17243) నాలుగు గంటలు, విజయవాడ-విశాఖపట్నం (12718) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా నడిచాయి.

పలు రైళ్ల రీషెడ్యూల్

- రాయగడ-గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా రాయగడలో 4.30 గంటలకు బయలుదేరింది.
- విశాఖపట్నం - కోర్బా(18518) ఎక్స్‌ప్రెస్ 1.25 గంటలు ఆలస్యంగా విశాఖపట్నంలో రాత్రి 10.30 గంటలకు బయలుదేరింది.